క్లుప్తంగా

రైతులకు శనగ విత్తనాలు పంపిణీ

పామూరు: తుఫాన్ కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకే ప్రభుత్వం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శనగ విత్తనాలు రాయితీపై పంపిణీ చేస్తున్నట్లు ఏడీఏలు ఇబ్రాయిమ్, ఇ.వి.రమణలు అన్నారు. దూబగుంట్ల ఆర్బీకేలో శనివారం జరిగిన కార్యక్రమంలో పంటనష్టపోయిన 54 మంది రైతులకు 46.25 క్వింటాళ్ల జేజీ11 రకం విత్తన శనగలను 80 శాతం రాయితీపై రైతులకు పంపిణీచేశారు. వ్యవసాయాధికారి కంచం రాధ, మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కందుల శ్రీనివాసరెడ్డి, రైతులు శ్రీనివాసులు, పలువురు పాల్గొన్నారు.

10 నుంచి క్రికెట్ టోర్నమెంట్

పొన్నలూరు: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండలంలోని పైరెడ్డిపాలెంలో ఈ నెల 10 నుంచి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్లు రూ.2 వేల ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. గెలుపొందిన జట్లకు మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.25 వేలు అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు 8142822122, 7093518010 నంబర్లను సంప్రదించాలని కోరారు.

గ్రావెల్ లారీ, జేసీబీ స్వాధీనం

టంగుటూరు: గ్రావెల్ తరలిస్తున్న లారీ, జేసీబీపై మైనింగ్ శాఖకు ఫిర్యాదు చేశామని తహసీల్దార్ చిరంజీవి అన్నారు. కొందరు వ్యక్తులు గ్రావెల్ తరలిస్తున్న సమాచారం మేరకు పరిశీలించగా వీఆర్వో, సర్వేయరును పంపి నిలుపుదల చేసి మైనింగ్ శాఖకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

అశోక్‌కుమార్‌రెడ్డికి జూపూడి పరామర్శ

సింగరాయకొండ: ఇటీవల అనారోగ్యానికి గురై హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందిన డాక్టర్ అశోక్‌కుమార్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జూపూడి ప్రభాకర్ శనివారం పరామర్శించారు. తరువాత మూలగుంటపాడు సర్పంచ్ డాక్టర్ శివ రామిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వరాహ లక్ష్మీనరశింహస్వామి దేవస్థాన ట్రస్టుబోర్డు చైర్మన్ పామర్తి మాధవరావు, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ బొడపాటి అరుణ, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ యనమల మాధవి, మర్రిపూడి మండల పార్టీ అధ్యక్షుడు బోదా రమణారెడ్డి, మాచేపల్లి నాగయ్య, కొండపి నాయకులు బి.ఉపేంద్ర, ఎంపీటీసీ పురిణి శ్రీనివాసులరెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బొట్ల రామారావు, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు శీలం రాము పాల్గొన్నారు.

న్యాయం చేయాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న బాధితులు

కనిగిరి రూరల్: తన కుమారుడు యుగంధర్ మృతికి కారణమైన వారి పై చర్యలు తీసుకోవాలని మృతుని తల్లి దండ్రులు, బంధువులు శనివారం స్థానిక పామూరు బస్టాండ్‌లో రాస్తారోకో చేశారు. బైక్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో పాతకూచిపల్లికి చెందిన యువకుడు యుగంధర్ శుక్రవారం మృతి చెందిన సంగతి విదితమే. ఈ సందర్భంగా మృతుని తల్లి దండ్రులు రవి, రత్తమ్మలు మాట్లాడుతూ తన కుమారుడి మృతి పట్ల పోలీసు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని, నిర్లక్ష్యంగా వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని, కారు డ్రైవర్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకోవడంతో సమస్య సర్దుమణిగింది.

కనిగిరి కొండపై వైఎస్సార్ సీపీ జెండా ఎగరేద్దాం

- చంద్రబాబు పాలనంతా దోచుకోవడం.. దాచుకోవడమే
- ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్



పింఛన్ నగదు అందచేస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ కొనసాగాలంటే కనిగిరి కొండపై వైఎస్సార్ సీపీ జెండా మరోసారి ఎగరాలని ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక వైఎస్సార్ భవన్‌లో శనివారం పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి అధ్యక్షతన జరిగిన వైఎస్సార్ పెన్షన్ కానుక వారోత్సవాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. చంద్రబాబు, టీడీపీ నేతలు, బడాబాబులు కలిసి ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. మేలు చేసిన వారికి దీవెనలు ఇవ్వండి, మంచి చేసిన వారికి ఆశీస్సులు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం సామాజిక పింఛన్ల నగదును పెంచి ఇచ్చి అవ్వతాతలకు ఆనందం రెట్టింపు చేశారన్నారు. టీడీపీ హయాంలో పింఛన్‌దారుడు చనిపోతేనే కొత్త పింఛన్ వచ్చేదని, నేడు ఆ పరిస్థితి లేదన్నారు. చంద్రబాబు పాలనలో నీరు చెట్టు, జన్మభూమి కమిటీల పేరిట దోచుకోవడం దాచుకోవడం తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. చంద్రబాబు అతని హయాంలో ఈ పథకాలన్నీ ఎందుకు అమలు చేయలేదని ప్రజలు నిలదీయాలన్నారు. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పింఛన్ సొమ్ము రూ.2,750 పెంచిందని, వచ్చే ఏడాది నెలకు రూ.3 వేలు ఇస్తామన్నారు. నియోజకవర్గంలో నెలలో 32,776 మందికి లబ్ధిదారులకు రూ.10.59 కోట్లు ఇస్తున్నామన్నారు. చిన్న చిన్న సాంకేతిక కారణాలతో ఆగిన పింఛన్లను అధికారులు సరిచేసి ఏ ఒక్క అర్హుడికి అన్యాయం చేయకుండా పింఛన్ నగదు అందచేయాలని కోరారు. రానున్న ఎన్నికల్లో మీరంతా వైఎస్సార్ సీపీకి అండగా నిలబడి జగనన్నను సీఎం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, వైస్ చైర్మన్ మాణిక్యరావు, కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, ఎంపీడీఓ మల్లికార్జునరావు, సింగిల్ విండో అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి, కౌన్సిలర్లు, కన్వీనర్లు, ఇతర నేతలు పాల్గొన్నారు.



పీసీపల్లిలో పింఛన్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పీసీపల్లి: పేద ప్రజల పక్షపాతి సీఎం జగన్ అని ఎంపీపీ అత్యాల జపన్య అన్నారు. స్థానిక స్త్రీ శక్తి భవనంలో మండలానికి నూతనంగా మంజూరైన 150 పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకటో తేదీనే ఠంచన్‌గా ఇంటికే పింఛన్లు అందుతున్నాయన్నారు. ప్రజలకు మంచి చేస్తుంటే ఓర్వలేని చంద్రబాబు పింఛన్లు తొలగిస్తున్నారని విష ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎంపీడీఓ రమణారెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మీకాంతం ఓకే రెడ్డి, మండల కన్వీనర్ బొర్రారెడ్డి, సర్పంచ్ మరియమ్మ, ఈఓఆర్డీ మల్లీశ్వరి ఉన్నారు.



వెలిగండ్లలో పింఛన్ల బుక్‌ను పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

వెలిగండ్ల: పేదల సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎంపీపీ రామన మహాలక్ష్మి, జెడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నూతన పింఛన్ల పంపిణీ ఎంపీడీఓ టి.సుకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాలు పేదల ఆర్థిక ప్రగతికి ఎంతో దోహదపడుతున్నాయన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా పింఛన్ల, ఇతర సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పారదర్శకంగా అందిస్తున్నారన్నారు. మండలంలో మొత్తం 118 కొత్త పింఛన్లు మంజూరయ్యాయన్నారు. జెడ్పీటీసీ మాజీ సభ్యులు రామన తిరుపతిరెడ్డి, సింగిల్‌విండో చైర్మెన్ కాకర్ల వెంకటేశ్వర్లు, వెలిగండ్ల సర్పంచ్ టి.సురేష్‌బాబు, హుస్సేన్‌పురం ఎంపీటీసీ డి.జనార్దన్, మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు హమీద్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా పనిచేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గాయం సావిత్రి

హనుమంతునిపాడు: అధికారులు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీపీ గాయం సావిత్రి అధికారులను హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గాయం సావిత్రి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు విద్యుత్ శాఖాధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు నెలల నుంచి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని అడుగుతున్నా స్పందించడం లేదని హనుమంతాపురం సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి ప్రశ్నించారు. ఆర్బీకేల్లో సబ్సిడీపై విత్తనాలు ఇస్తామని ఇవ్వలేదని అడిగారు. ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని, దరకాస్తు చేసుకున్న వారికి కొత్త కార్డులు ఇవ్వలేదని, చేసిన పనులకు బిల్లులు రాలేదని ఏపీఓను ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు. నిర్మాణంలో ఉన్న సచివాలయాలను పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఎంపీపీ గాయం సావిత్రి మాట్లాడుతూ సంక్షేమ పథకాలన్నీ అర్హులకు అందేలా చూడాలన్నారు. అధికారులు బాధ్యతగా పనిచేసి మండలాన్ని అభివృద్ధి బాటలో నడిపించాలన్నారు. తాగునీరు, విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం మండలానికి నూతనంగా మంజూరైన 151 పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమం ఎంపీడీఓ జీవీ కృష్ణారావు, తహసీల్దార్ ఎస్.హరిబాబు, వైఎస్ ఎంపీపీ కొదమల బెంజిమెన్, వైఎస్ ఎంపీపీ రుద్రపాటి శోభ, కో ఆప్షన్ సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచులు, ఇతర నేతలు పాల్గొన్నారు.

హక్కులు కాపాడుకునేందుకు ఐక్యంగా ఉండాలి

పామూరు: హక్కులను కాపాడుకునేందుకు కార్మికులంతా ఐక్యంగా ఉండాలని సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రి అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శనివారం జరిగిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తున్నదన్నారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘ నూతన కమిటీ నాయకులు షేక్.మస్తాన్‌వలి, హరి, పి.సుబ్రమణ్యం, విజయ్, పఠాన్‌సుబాని, రసూల్, శంకర్, అల్లాబక్షు ఉన్నారు.

రోడ్లపై సభలు, ర్యాలీలకు నో



సమావేశంలో మాట్లాడుతున్నా డీఎస్పీ కండే శ్రీనివాసులు

కందుకూరు: జీఓ–1 ప్రకారం రోడ్లపై ఎటువంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు నిర్వహించడానికి లేదని, అనుమతులు లేకుండా అటువంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని డీఎస్పీ కండే శ్రీనివాసులు తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దీనిపై ఇప్పటికే స్పష్టమైన ప్రకటన చేశామన్నారు. జాతీయ రహదారులు, రాష్ట్ర, పంచాయతీ రహదారులపై పూర్తిగా సభలు, సమావేశాలు నిషేధించినట్లు తెలిపారు. భలు, ర్యాలీలకు ముందుగా అనుమతులు తీసుకోవాలని, దీని కోసం మూడు రోజుల ముందే నిర్వాహకులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. అనంతరం పోలీస్‌శాఖ ఆ ప్రాంతాన్ని పరిశీలించి సాధారణ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేవని నిర్ధారించుకున్న తరువాత ఎస్పీ స్థాయిలో నిర్ణయం తీసుకుంటారన్నారు. ఎవరైనా చట్టవిరుద్ధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కందుకూరు, గుడ్లూరు సీఐలు వెంకట్రావ్, సుబ్బారావులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.5.52 లక్షలు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

సింగరాయకొండ: పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీ నరశింహస్వామి దేవస్థానంలో శనివారం హుండీ లెక్కింపు నిర్వహించారు. హుండీ ఆదాయం రూ.5,52,725, కొంత బంగారం వచ్చినట్లు దేవస్థాన ఈఓ పి.కృష్ణవేణి తెలిపారు. జూన్‌లో హుండీ లెక్కించగా లెక్కింపు చేయగా 4.08 లక్షల ఆదాయం వచ్చిందని ఆమె వివరించారు. లెక్కింపులో భాగంగా వచ్చిన బంగారాన్ని ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పామర్తి మాధవరావు, ట్రస్టు బోర్డు సభ్యుల ఆధ్వర్యంలో బంగారాన్ని మరలా హుండీలో వేశామన్నారు. దేవస్థాన ఇన్‌స్పెక్టర్ సత్యన్నారాయణ, బోర్డు మెంబర్లు చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు, ఆదిపోగు మాలకొండయ్య, మట్టా సుబ్బారావు పాల్గొన్నారు.

ఖోఖో విజేతలు కనిగిరి విద్యార్థులు



ఖోఖో విజేతలను అభినందిస్తున్న పీడీ, కరస్పాండెంట్

కనిగిరి రూరల్: ఆచార్య నాగార్జున యూనివర్శిటీ మహిళా విభాగం ఖోఖో విజేతగా కనిగిరి ఎంఎస్ఎం కళాశాల విద్యార్థులు నిలిచినట్లు పీడీ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కాశీ విశ్వనాథరెడ్డి తెలిపారు. ఈ నెల 5, 6 తేదీల్లో గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున యూనివర్శిలో జరిగిన పోటీల్లో ఫైనల్‌లో నాగార్జున యూనివర్శిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీపై 20–02 తేడాతో కనిగిరి కళాశాల టీం విజయం సాధించింది. శనివారం మహిళా ఖోఖో క్రీడాకారులను పీడీ కాశీ విశ్వనాథరెడ్డి, కరస్పాండెంట్ ఏలూరి సుబ్బారావు ప్రిన్సిపాల్ పాపిరెడ్డిలు అభినందించారు.

పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు



గృహ సారథుల నియామకంలో వరికూటి

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు

సింగరాయకొండ: ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత పారదర్శకంగా అందించే లక్ష్యంతో గృహ సారథులను నియమిస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం సింగరాయకొండ పంచాయతీలోని నాలుగు గ్రామ సచివాలయాల పరిధిలో గృహ సారధుల నియామకం నిర్వహించారు. వరికూటి మాట్లాడుతూ గ్రామ సచివాలయ పరిధిలోని ప్రతి గ్రామ వలంటీర్‌కు తోడుగా ఇద్దరినీ గృహ సారధులను నియమిస్తున్నామన్నారు. ఇటీవల ప్రతి గ్రామ సచివాలయానికి ముగ్గురు కన్వీనర్లను నియమించామన్నారు. వీరందరి సమన్వయంతో అర్హులందరికీ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందించే అవకాశం కలుగుతుందన్నారు. సింగరాయకొండ పంచాయతీలో 105 గ్రామ వాలంటీర్లకు, 210 మంది గృహ సారధులను నియమించామన్నారు. వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, షేక్ పటేల్, షేక్ సలీంభాషా, గ్రామ సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి



ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్, కమిషనర్

కనిగిరి రూరల్: సచివాలయాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 12వ సచివాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని శనివారం చైర్మన్ గఫార్, కమిషనర్ డీవీఎస్ నారాయణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ఆధార్ సేవలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వాసవీ సత్ర సముదాయ రాష్ట్ర చైర్మన్ దేవకి వెంకటేశ్వర్లు, నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు



వల్లూరులో సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న ఎస్సై

టంగుటూరు: నేరాలను నియంత్రించడంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎస్సై ఖాదర్‌బాషా అన్నారు. మండలంలోని వల్లూరులో, రహదారి పక్కల దాతల సహకారంతో 7 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నేరాలు పునరావృతం కాకుండా గ్రామాన్ని పరిశీలించి భద్రత దృష్ట్యా కెమెరాలను ఏర్పాటు చేయించామన్నారు.

నేడు ముప్పాళ్లలో గడప గడపకు మన ప్రభుత్వం

పొన్నలూరు: మండలంలోని ముప్పాళ్లలో ఆదివారం ఉదయం 8 గంటలకు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు పాల్గొనాలని కోరారు.

10న క్రికెట్ టోర్నమెంట్

జరుగుమల్లి(సింగరాయకొండ): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని జరుగుమల్లి మండలం పీరాపురంలో ఈ నెల 10వ తేదీ వైఎస్సార్ జగనన్న క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించనున్నట్లు పీరాపురం వైఎస్సార్ యూత్‌ఫోర్స్ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్లకు మొదటి బహుమతి రూ.10,116, రెండో బహుమతి రూ.7,116 అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే జట్లు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.